
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 1 | సెప్టెంబరు 2025

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

**చందా**
సంవత్సర చందా: రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

**ఈ సంచికలో. . . .**


జీవిత విధానం - ప్రార్థన ........................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 5

హైదరాబాదు లక్ష్మిగారు ........................ 20

**ఇతర విషయములు :**


చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



భగవంతుడు, భగవంతుడి
యొక్క నామం వేరు కాదు.
నామం భగవంతుడై ఉన్నది.
నామ స్మరణ వలన
హృదయంలో ఉన్న
సత్యవస్తువుతో
అనుబంధం
ఏర్పడుతుంది.

# జీవిత విధానం - ప్రార్థన

(పి. సంధ్య, హైదరాబాద్)



జ్ఞాని అయిన గురువుని ఆశ్రయించినప్పుడు, ఆ గురువు శాస్త్రంలో చెప్పిన మాటలను, భగవంతుడు చెప్పిన మాటలను బోధిస్తాడు. మనం జీవితంలో ఏది చెయ్యాలో, ఏది చెయ్య కూడదో, ఏది విధి, ఏది నిషిద్ధము అవి చెపుతాడు. ఎందుకు చెయ్యకూడదు, ఎందుకు చెయ్యాలి, ఇలాంటి తర్కంలోకి వెళ్ళకుండా గురువు పట్ల విశ్వాసంతోటి భగవంతుడి పట్ల శరణాగతి తోటి మన స్వభావాన్ని, జీవిత విధానాన్ని అలా మలుచుకోవటం వల్ల జ్ఞానాన్ని పొందుతాము. అయితే గురువు చెప్పిన మాటలను శాస్త్రంలో చెప్పిన మాటలను మనలో ఉన్న దోషాల కారణంగా అంగీకరించలేక పోతున్నాము అని చెపుతున్నారు నాన్నగారు.

మనం పెద్ద పెద్ద తపస్సులు చెయ్యలేము. అందుకని గురువుని ప్రార్థించేటప్పుడు, నువ్వు నన్ను పరీక్షలకు గురిపెట్టకు తండ్రీ, నువ్వు పెట్టే పరీక్షలకి నేను తట్టుకోలేను. మేము ఏదైనా తప్పులు చేసినా, మా తప్పులని క్షమించి మమ్మల్ని అనుగ్రహించు అని శరణాగతితో ప్రార్థించాలి, అని నాన్నగారు, అక్షరమణమాలలో భగవాను చెప్పారు ఆయన శక్తివంతుడు, దయాస్వరూపుడు, కాబట్టి మన పొరపాట్లు అన్నీ క్షమించి ఆయన యొక్క ఆనందస్థితిని, సుఖస్థితిని మనకి ఇవ్వగలడు. ఆ విశ్వాసం లేకపోతే మనం ప్రార్థించలేము. ఆ విశ్వాసం కలగటానికే ఈ ప్రార్థనలు అన్నీ. భగవంతుడిని మనస్పూర్తిగా విశ్వాసంతోటి ప్రార్థించి, ఆయనకి శరణాగతి చెందటం వల్ల ఆయన నీ లోపల ఉన్న సీక్రెట్ బర్డెన్స్ అన్నిటినీ, తొలగించుకోలేనటువంటి బరువులన్నీటినీ తొలగిస్తాడు అంటున్నారు నాన్నగారు. ఆయన యొక్క ఔన్నత్యం మనస్సుకి అందితేనే మనం ప్రార్థన చేస్తాము. మనం ఎన్నో తప్పులు చేసాము, ఇంక మనని క్షమించడు అనుకుంటే అది మన మనస్సులో ఉన్న దోషము అంటున్నారు.

మనం సాధన చేసేటప్పుడు అనేక రకాల జ్ఞాపకాలు మనని తరుముకుని వస్తూ ఉంటాయి. మన శక్తికి మించి సాధన చెయ్యలేము. మన లోపల వాసనలని తొలగించు కోలేము. గురువు మీద భారం వేసి, నిండుమనస్సుతో ప్రార్థించటం వల్ల మన లోపల ఏ దోషాలైతే, ఏ జ్ఞాపకాలైతే జ్ఞానానికి అడ్డు వస్తున్నాయో, వాటిని భగవంతుడు తొలగించి హృదయం వైపుగా మనల్ని తోలుకెళ్ళిపోతాడు. గురువుకి అసాధ్యం అంటూ లేదు అని మన బుద్ధికి స్పష్టంగా తెలియాలి. మన తప్పులు, మన జ్ఞాపకాలు మనకి పెద్దవిగా అనిపిస్తాయి. కాని మనస్సుకి మూలంగా ఉన్న ఈశ్వరుడికి, అంతటా బ్రహ్మమై ఉన్న ఈశ్వరుడికి అవన్నీ స్వల్పమైనవి అల్పమైనవి. మనం నాన్నగారి పట్ల శరణాగతి భావంతో ఉంటే, టైము వచ్చినప్పుడు మన దోషాలని ఆయనే తీసేస్తారు. ఈలోపల సహనంతోటి ఉండాలి. మళ్ళీ మళ్ళీ ఆ తలంపు మనకి గుర్తుకి వస్తోంది అంటే అది మన శరణాగతి లోపం. ఆయన మీద భారం వేసాము కాని ఆ పని అవ్వలేదు అనుకుంటే, అది శరణాగతి కాదు, భక్తి కాదు. ఆయన మీద ఉన్న విశ్వాసం మళ్ళీ ఆ తలంపుని తీసుకురాకూడదు. భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే, దుఃఖమే కాదు, దుఃఖకారణం కూడా నశించిపోతుంది.

ప్రార్థన వల్ల మన లోపల ఏ దోషం ఉందో మనకి అర్థం అవుతుంది. మనలో ఉన్న దోషాన్ని మనకి తెలియజేసే తియ్యాలి. అది ఈశ్వరుడి యొక్క చట్టం కాబట్టి మనకి తెలియచేస్తాడు అనేవారు నాన్నగారు. అవి చూపించినప్పుడు కొంత అశాంతి ఉంటుంది. చూపించకుండా ఆ దోషం ఉందని మనకి తెలియదు, కాని ఆ దోషాలే మనం బ్రాహ్మీస్థితి పొందకుండా, జ్ఞానం పొందకుండా అడ్డు పడతాయి. మన దోషాన్ని మనకి చూపించినప్పుడు మనం ఎస్కేప్ అవ్వకుండా, మన దోషం అంగీకరించి, అర్థం చేసుకొని దానిని తొలగించమని భగవంతుడిని ప్రార్థించాలి. అప్పుడు ఆయన అనుగ్రహం అనే మందు వేసి మనలో ఉన్న దోషాన్ని తొలగిస్తాడు. ఆయన అనుగ్రహం మన కళ్ళకి కనిపించదు. కాని కాలం గడిచేకొలదీ మన ప్రయత్నాల వల్ల అది తొలగిపోలేదు, ఆయన అనుగ్రహం వల్ల తొలగింది అని మనకి చూపిస్తాడు. ఆయన అనుగ్రహం అర్థం అయితే, మనస్సు శరణాగతి పొందటానికి ఒప్పుకొంటుంది. ఆయన బయటికి కనిపించక పోయినా, ప్రార్థన వల్ల ఆయన పట్ల విశ్వాసం వల్ల గురువు అంతర్యామిగా ఉండి ఇవన్నీ చేస్తున్నాడు అని మనకి లోపలినుంచి స్ఫురణ ఇస్తాడు.

మనం ఈ సబ్జెక్టు వినేటప్పుడు, శ్రద్ధతోటి విని దానిని అర్థం చేసుకోవటానికి మనం ప్రయత్నిస్తుంటే, భగవంతుడి ఔన్నత్యం మనకి అందుతూ వుంటుంది. ఆయన మాటలు

శ్రవణం మననం చేస్తే మన ఆలోచన విధానంలో మార్పు వస్తుంది. ధర్మం బేస్ లేకుండా జ్ఞానం రాదు. అందుచేత ధర్మాన్ని పాటించాలి, అలాగే ధర్మంతో పాటు ఉపాసన చెయ్యాలి, అంటే ఇష్టదైవాన్ని కాని గురువుని కాని స్మరించాలి. పూజ, జప, ధ్యానం, విచారణ ద్వారా నీకు ఇష్టమైన పద్ధతి లో ఉపాసన చెయ్యాలి. ఉపాసన వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది, వీటితోపాటు సత్కర్మ కూడా చెయ్యాలి. ఎంతోకొంత స్వార్థాన్ని తగ్గించుకొని చేసేది సత్కర్మ. మన ఇష్టాయిష్టాల కోసం కాకుండా భగవంతుడి దయ కోసం పని చేస్తే మనకి ఆయన దయ వస్తుంది, జ్ఞానం వస్తుంది. మనం ఎవరినీ ద్వేషించకూడదు, సృష్టి అంతా భగవంతుడిదే, అంతటా ఉన్నది భగవంతుడే. ద్వేషం వల్ల శాంతిని కోల్పోతాము. అలాగే ఇతరులు మనని ద్వేషిస్తుంటే సహించాలి. ఆ సహనంలోనే జ్ఞానానికి దారి కనిపిస్తుంది. ఇవన్నీ మనం నాన్నగారి జీవితంలో చూసాము. ఎందరో ఆయనని ద్వేషించినప్పటికీ ఆయన సహించారు. అసలు ద్వేషాన్ని చూడలేదు, అలాగ జీవించారు నాన్నగారు. ఆయన శరీర మాత్రుడు కాదు. జ్ఞాని అయినటువంటి గురువు, మనకి అంతర్యామిగా ఉన్న భగవంతుడే ఒక దేహం తీసుకొని వచ్చి ఇవన్నీ బోధించి, జీవితవిధానంలో అటువైపుగా మనలను నడిపించారు.

ఇవన్నీ చేస్తేనే భగవంతుడి దయ మన శిరస్సు మీద ఉంటుంది. అంతర్యామిగా ఉన్నవాడి దయ లోపలినుంచి పొంగి మన మనస్సుని లాగేసుకుంటాడు. లోపల వస్తువు ఎంత పవిత్రంగా ఉందో మన మనస్సు అంత పవిత్రం అయితేనే అందులో ఐక్యం అయ్యి, స్వరూపస్థితి పొందుతాము. భగవంతుడిని ప్రేమిస్తున్నాము అంటే, భగవంతుడే ఆయన మీద నీకు ప్రేమ కలిగేటట్లుగా నీమీద దయ చూపిస్తున్నాడు అని నాన్నగారు చెపుతున్నారు. ఆయన దయ వల్లే నువ్వు ఆయనని ప్రేమిస్తున్నావు. ఆయన దయకోసం జీవించటానికి మనస్సుని సరిచేసుకోవాలి. ఆయన మీద ప్రేమ వల్లే మనస్సు పవిత్రమవుతుంది.

భగవంతుడిని ప్రార్థించటం ఎలాగో, జీవితవిధానం ఎలా ఉండాలో నాన్నగారు మనకి తెలియచేసారు. గురువు శరీరం మన కళ్ళకి కనిపించనంత మాత్రాన ఆయన లేడు అనుకోవద్దు. అది మన అవగాహన లోపం. అరుణాచలేశ్వరుడే దేహం తీసుకొని భగవానుగా వచ్చి, మళ్ళీ ఆయనే నాన్నగారిగా వచ్చారు. ఏ పేరు పెట్టి పిలిచినా ఉన్నది ఒక్కటే కాబట్టి ఆయనకే అందుతుంది. ఆ వివేకం ఉంటేనే, ఉన్నది ఒక్కటే బ్రాహ్మీస్థితి అని మనకి అర్థం అయితేనే మన ప్రార్థనలో, విశ్వాసంలో కూడా బలం ఉంటుంది. ఈ ప్రార్థనలు, శరణాగతి ఇవన్నీ అంతర్యామిగా ఉన్న భగవంతుడి వైపు ప్రయాణం చెయ్యటానికి, జ్ఞానం వైపుకి వెళ్ళటానికి సహకరిస్తాయి.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 30 జూన్ 1996, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

వివేక చూడామణిలో ఆచార్య స్వామివారు చెప్పినటువంటి కొన్ని మాటలు మీకు వివరిస్తున్నాను. అజ్ఞానం అనే పిశాచం, అహంకారం అనే పిశాచం మీ లోపలే ఉంది, అది బయట లేదు. ఈ అహంకారం అనే పిశాచంతోటి, ఆ False "I" తోటి, body bound "I" తోటి ఎంతకాలం అయితే మీరు అనుబంధం పెట్టుకుంటారో, దానితోటి ఎంతకాలం అయితే మీరు సంబంధం పెట్టుకుంటారో, There is not any possibility of liberation. ఇంక మీరు ఎన్ని సాధనలుచేసినా, ఎన్ని ప్రక్రియలు చేసినా, ఎన్ని గుంజీలు తీసినా మీకు మోక్షం అనే సమస్య లేనే లేదు, రానే రాదు.

బాహ్యంగా మీరు ఎన్ని చేసుకున్నప్పటికీ, ఎన్ని జిమ్మిక్కులు చేస్తున్నప్పటికీ వీటి వల్ల లోపల మీకు లిబరేషన్, మోక్షం రాదు. లోపల మీకు అహంకార పిశాచం తోటి, ఆ cruel "I" తోటి, ఆ false "I" తోటి, body bound "I" తోటి, లోపల ఉన్న అజ్ఞానం తోటి ఎంతకాలం అయితే అనుబంధం ఉందో, సంబంధం ఉందో, మీకు ఎంతకాలం అయితే ఆ కనెక్షన్ ఉందో, అంతకాలం మీకు మోక్షం ఉదయించే సమస్య లేదు. మీరు శాంతి అనే ఒడ్డుకి రాలేరు, మోక్షం అనే ఒడ్డుకి మీరు రాలేరు, మోక్ష శాంతిని పొందలేరు, ఆ నిర్వాణ సుఖాన్ని మీరు పొందలేరు. బాహ్యంగా పూజలు, జపాలు మీ పద్ధతిలో మీరు చేసుకోవచ్చు, దానిని కాదు అనడం లేదు ఆచార్యుల వారు. కానీ మీకు లోపల ఈగో తోటి, ఆ దేహగతమైన నేను తోటి, లోపల ఉన్నటువంటి అహంవృత్తి తోటి, అజ్ఞానం తోటి మీకు ఎంతవరకు సంబంధం ఉందో చూసుకుంటూ ఉంటాడు పరమేశ్వరుడు. ఆ సంబంధం కనుక తెగిపోతే మీకు వెంటనే మోక్షం వస్తుంది, ఆ సంబంధం కనుక తెగకపోతే ఎన్ని వేలాది జన్మలు ఎత్తినా, ఎన్ని శవాలు మీరు మోసినప్పటికీ, లోపల ఉన్న అజ్ఞానం తోటి సంబంధం

ఉన్నంత కాలం, బాహ్యమైన జిమ్మిక్కులవల్ల మీకు మోక్షం వస్తుంది అని ఎవరూ ఊహించుకోవద్దు.

కొంతమందికి అహంకారం ఉన్నట్టు పైకి కనిపించదు కానీ లోపల చాలా ఉంటుంది. ఒకవేళ మీకు పైకి కనిపించకపోయినా లోపల ఉన్నప్పటికీ, భగవంతుడు డైరెక్ట్‌గా మీ హృదయాన్ని చూస్తాడు. మీకున్న అహంకారం ఇతర మనుషులకి కనిపించకపోవచ్చు, సమాజానికి కనిపించకపోవచ్చు, ప్రపంచానికి కనిపించకపోవచ్చు, ఏ మనిషికి ఆ మనిషికి ఉందో లేదో తెలుస్తూ ఉంటుంది. కానీ కొంతమంది తెలివైన అహంకారం బయటకి కనపడకుండా చూసుకుంటారు, బయటకి కనపడకపోయినంత మాత్రాన అహంకారం లేదు అని కాదు. అసలు బయటకి కనిపిస్తుందా, కనిపించడం లేదా అనేది ముఖ్యం కాదు. లోపల ఉందా, లేదా అనేది చూస్తాడు పరమేశ్వరుడు. పరమేశ్వరుడు డైరెక్ట్‌గా మీ హృదయాన్నే చూస్తూ ఉంటాడు, మీ చర్మాన్ని కాదు. హృదయాన్ని చూసి అక్కడ ఏ రూపంలో మీకు సంబంధం ఉన్నప్పటికీ, అంటే ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ, ఏ రూపంలో అహంభావం తోటి మీకు సంబంధం ఉన్నప్పటికీ, There is not any possibility of liberation. మీకు మోక్షం వచ్చే అవకాశం లేదు, లేదు, లేదు. శాంతి కలిగే అవకాశం లేదు, శాంతి కూడా కలగదు అంటున్నారు.

భగవాన్ ఒక చిన్న రహస్యం చెప్పారు, ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. ఎవడైతే మనస్సుని నిగ్రహించుకోవాలి అనుకుంటున్నాడో, వాడు ముందు అహంకారాన్ని, అహంవృత్తిని కొంచెం జోకొడుతూ ఉండాలి. అంటే అహంకారాన్ని ముందు కొంచెం

**సృష్టిలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఆ ఆకర్షణల జోలికి నీ మనస్సును వెళ్లనివ్వకు. వస్తు స్మరణ, విషయ స్మరణ లేకుండా నీ మనసుని నిరోధించు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు.**



నెమ్మది పరచాలి. అహంకారాన్ని తొలగించుకోవాలి అనే ప్రయత్నం మీకు హృదయంతరాళాల్లో ఎంతోకొంత సంకల్పం లేకపోతే, ఆ తలంపు మీకు లేకపోతే మనస్సుని నిగ్రహించుకోవడానికి మీరు ప్రయత్నం చేసినా ఆ ప్రయత్నం సాగదు, అది ఒడ్డుకి రాదు. అజ్ఞానానికి వేరు ఏమిటి అంటే, మనస్సుకి వేరు ఏమిటి అంటే, ఈ దేహగతమైన నేను. ఆ వేరుని తొలగించుకోవాలి అనే ప్రయత్నం మీకు ఉంటే మనసు కూడా దానంతట అది మీకు స్వాధీనంలోకి వస్తుంది. అంటే ఎవడైతే తన అహంవృత్తిని పోగొట్టుకోవడానికి హృదయ పూర్వకంగా ప్రయత్నం చేస్తున్నాడో వాడికి మనో నిగ్రహం కూడా కలుగుతుంది. చెట్టుకి నీళ్ళు ఎక్కడ పోస్తాం అంటే ఆకులకి, రొబ్బలకి కాదు వేరుకి పోస్తున్నాం. వేరుకి పోస్తుంటే రొబ్బలు పచ్చగా ఉంటున్నాయి, పువ్వులు పచ్చగా ఉంటున్నాయి, ఆకులు కూడా పచ్చగానే ఉంటాయి. అలాగే మనకి ఎప్పుడైతే ఆత్మానుభవం కలిగిందో, ఆత్మజ్ఞానం కలిగిందో, ఆత్మ వికాసం కలిగిందో, ఆ చైతన్యస్థాయి ఎప్పుడైతే పెరిగిందో, అప్పుడు ఇంద్రియాలు, మనస్సు కూడా చల్లగా ఉంటాయి. చెట్టు మొదట్లో పోసే నీళ్ళు వల్ల ఆకులు, రొబ్బలు ఎంత పచ్చగా ఉంటున్నాయో, అలాగే మనం ఎప్పుడైతే ఈ అహంవృత్తిని పోగొట్టుకుని, ఆత్మానుభవం సంపాదించామో, ఆత్మజ్ఞానాన్ని సంపాదించామో మన ఇంద్రియాలే మనలని సుఖపెడతాయి, మన మనస్సు మనలని సుఖ పెడుతుంది, మన మనస్సు చల్లగా ఉంటుంది. వేసవికాలంలో మంచి చల్లటి గాలి వేస్తుంటే ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో, ఆత్మానుభవం కలిగినవాడి ఇంద్రియాలు, వాడి మనస్సు, కూడా అంత చల్లగా ఉంటాయి. అయితే లోపల ఉన్నటువంటి అహంవృత్తి తోటి వేరుపడడం, అత్తాకోడళ్ళు వేరు పడినంత తేలిక కాదు. అత్తగారు కోడలు లోంచి, కోడలు అత్తగారి లోంచి వేరు పడడం తేలికే. నువ్వు వేరు, నీ అత్తగారు వేరు అనుకుంటున్నావు కాబట్టి విడిపోతున్నారు. ఈ అహంకారం లోంచి వేరు పడడం అంత తేలిక కాదు. ఎందుచేత అంటే అదే నువ్వు అనుకుంటున్నావు కాబట్టి, అహంకారమే నేను అనుకుంటున్నాను కాబట్టి దానితోటి నేను సెపరేట్ అవ్వడం అంత తెలికేమి కాదు. అహంకారం తోటి వేరుపడడం అనేది నువ్వు

అనుకున్నంత తేలిక కాదు. దానికి సాధనాబలం ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి, శాస్త్ర అనుగ్రహం ఉండాలి, ఈశ్వరుడి యొక్క అనుగ్రహం ఉండాలి, ఇవి అన్నీ కలిసిరావాలి. ఇవి అన్నీ కలిసి ఉంటేనే కానీ నువ్వు దాంట్లోంచి వేరు పడలేవు. అహంకారాన్ని ఎవడూ పోగొట్టుకోవడానికి ఇష్టపడడు, ఎందుచేత ఇష్టపడడు అంటే అదే వాడు అనుకుంటున్నాడు. అహంకారమే నేను అనుకుంటున్నాను కాబట్టి, నన్ను నేను చంపుకోవడానికి ఇష్టపడను. ఏదైతే నువ్వు కాదో, అదే నువ్వు అనుకుంటున్నావు. అహంకారం నువ్వు అనుకున్నప్పుడు కూడా నువ్వు కాదు. నువ్వు కాదు అనుకున్నప్పుడు కూడా కాదు. దానితోటి నువ్వు వేరుపడాలి, సెపరేట్అవ్వాలి. అప్పుడు కానీ నీకు మోక్షం అనే సమస్య లేదు. అప్పుడు కానీ నీకు జ్ఞానోదయం కలగనే కలగదు.

ఈ జన్మలు కూడా అహంకారానికే. శరీరం పోతుంది, శరీరం వస్తూ ఉంటుంది, ఇవన్నీ అహంకారానికే. అహంకారం ఏమీ కూడా మారదు, ఇది మీరు బాగా అర్థం చేసుకోండి, మనం చనిపోయినప్పుడు శరీరం మారుతుంది కానీ జీవుడు ఏమీ మారడు. అందుచేత జీవలక్షణాలు నశించాలి. ఆ జీవ లక్షణాలకి వేరు ఏమిటి? అహంకారం. అహంకారాన్ని పోగొట్టుకుంటేనే కానీ జీవ లక్షణాలు నశించవు. అందుచేత నీకు అహంకారం నశిస్తేనే కానీ నీకు మోక్షం వచ్చే సమస్యే లేదు, అవకాశం కూడా నీకు లేనే లేదు. మనం పాడయ్యిపోవడానికి ఒక ఆకర్షణ కాదు అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఇందులో ఏ ఆకర్షణకి లోబడినా పాడయ్యిపోతాం. మనం పాడయ్యిపోవడానికి, పతనం అయ్యిపోవడానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఇందులో ఏ ఆకర్షణకి లోబడినప్పటికీ ఆ మనిషి పతనం అయిపోతాడు. కుండకి పది చిల్లులు అక్కర్లేదు, ఒక చిల్లు ఉన్నా చాలు మొత్తం నీళ్ళు అన్నీ కూడా బయటకి వచ్చేస్తాయి. అలాగే నువ్వు పతనం అవ్వడానికి లోకంలో ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి. ఇందులో ఏ ఆకర్షణకి నువ్వు లోబడినప్పటికీ నువ్వు పతనం అయ్యిపోతావు. ఎన్ని ఆకర్షణలు ఉన్నప్పటికీ ఈ ఆకర్షణలు ఎవరికి అనే ప్రశ్న వేసుకుంటే నేనుకే, అంటే మళ్ళీ ఇవన్నీ ఎక్కడికి? అహంకారంలోకే వస్తున్నాయి. ఇక్కడ రమణమహర్షి గారు ఒక

రహస్యం చెప్పారు. అహంకారం తోటి సంబంధం లేకుండా లోకానికి తనంతట తానుగా అస్థిత్వం లేదు. నీకు మనస్సు ఉన్నప్పుడే లోకం తెలుస్తుంది, మనస్సు లేకపోతే నీకు లోకం తెలియడం లేదు. ఈ లోకం ఉందని మనస్సు చెబుతుంది కానీ నేను ఉన్నాను అని లోకం ఎవరి తోటి చెప్పడం లేదు, నా మనస్సు చెబుతుంది లోకం ఉందని. అంటే నీకు మనస్సు ఉంటే లోకం ఉంది కానీ మనస్సు లేకపోతే లోకం లేదు, లోకానికి ప్రత్యేకమైన ఉనికి లేదు.

అందుకే భగవాన్ చెబుతూ ఉంటారు నువ్వు ఎలా ఉన్నావో ప్రపంచం కూడా అలాగే కనపడుతుంది. ప్రపంచం మంచిది కాదు, చెడ్డది కాదు. కొంతమంది లోకం ఇలా ఉంది, అలా ఉంది అనుకుంటారు. రమణమహర్షి గారు చెప్పారు ఈ లోకం మంచిది కాదు, చెడ్డది కాదు కేవలం ఒక అద్దం లాంటిది. లోకం ఊరికే మన బలహీనతలని చూపిస్తుంది, కాని తియ్యదు. కానీ ఆ బలహీనతలని సాధన చేసి తీసుకోవలసింది మనమే. ఆచార్యుల వారు "మనం బాగుపడాలని, మనం తరించాలని, ఆయన ఏ సుఖాన్ని అయితే అనుభవిస్తున్నాడో, ఏ శాంతిని అయితే అనుభవిస్తున్నాడో ఆ సుఖాన్ని, ఆ శాంతిని మనకి అనుభవంలోకి తీసుకుని రావాలని" చెపుతున్నారు. మీకు బాగా ఇష్టమైన వాళ్ళు ఉన్నారు అనుకోండి, మీరు బూర్లు వండుకుంటే వాళ్లకి కూడా పెట్టాలని అనిపిస్తుంది. అలాగే ఆచార్యుల వారు ఆయన పొందే శాంతిని, ఆయన పొందే సుఖాన్ని కూడా లోకానికి ఇవ్వడం కోసం అనేక ఉదాహరణలు తోటి మనకి అందజేస్తున్నారు, Out of love, ఈ సృష్టి మీద వాళ్లకి ఉన్న ప్రేమ అటువంటిది. అంటే సృష్టిని వాళ్ళు ప్రేమతో తడుపుతున్నారు.

ఆచార్యులవారు ఏమని చెబుతున్నారు అంటే మీరు ఏదైనా పెద్ద రోగం తోటి బాధపడుతున్నారు అనుకోండి మాటవరసకి, ఆ రోగం నుండి మీరు విడుదల పొందలేదు అనుకోండి, నా ఆరోగ్యం బాగానే ఉందండి, బాగానే ఉంటున్నాను అంటే ఆ మాటలకి ఏదైనా అర్థం ఉందా అని అడుగుతున్నారు ఆచార్యులవారు. అదేవిధంగా నువ్వు అజ్ఞానం అనే జబ్బు లోపల పెట్టుకుని మేము శాంతిగానే ఉన్నాము, సుఖంగానే ఉన్నాము అనుకోవడం కూడా అటువంటిదే. అంటే నువ్వు ఏదైనా దీర్ఘ రోగం తోటి బాధపడుతున్నప్పుడు నువ్వు

ఆ రోగం నుండి బయటకి వస్తేనే కానీ నీకు ఆరోగ్యం కలగదు. రోగం తగ్గకుండా మేము ఆరోగ్యంగా ఉన్నామని చెప్పడం ఎటువంటిదో, లోపల అహంకారాన్ని పెట్టుకుని, అజ్ఞానాన్ని పెట్టుకుని, మేము శాంతిగానే ఉన్నాం, సుఖంగానే ఉన్నాం, ఆనందంగా ఉన్నాం అని చెప్పడం కూడా అటువంటిదే. నువ్వు రోగం లోంచి బయటకి రాకపోతే నీకు ఆరోగ్యం రాదు, అదేవిధంగా అజ్ఞానం లోంచి, అహంకారం లోంచి బయటకి రాకపోతే నీకు జ్ఞానం లేదు, శాంతి లేదు. లోపల అజ్ఞానం పెట్టుకుని శాంతిగా ఉన్నాను, సుఖంగా ఉన్నాను అంటే ఎందుకు ఈ మాయ మాటలు అనవసరం. నీకు టైం వేస్ట్, వినేవాడికి టైం వేస్ట్ అంటున్నారు ఆచార్యులవారు.

ఈ అహంకారం లోంచి, ఈ అజ్ఞానం లోంచి బయట పడ్డారు అనుకోండి మీరు కొత్తగా పొందేది ఏదీ లేదు, మీ స్వరూపాన్నే మీరు పొందుతారు, మీ హృదయంలో ఉన్న సద్వస్తువునే పొందుతారు. అంటే భగవంతుడి యొక్క స్వరూపాన్నే మీరు పొందుతారు. కొత్తగా ఏదైనా మీరు పొందితే అది కాలప్రవాహంలో కొట్టుకుని పోతుంది. సహజంగా మీ హృదయంలో నార్మల్‌గా, naturalగా ఒక సద్వస్తువు ఉంది. దేహబుద్ధిని ఎప్పుడైతే తొలగించుకున్నారో వెంటనే మరుక్షణంలో మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. అంటే దాని అర్థం ఏమిటి అంటే ఇప్పుడు నీకు దేహం నేనుగా ఎలా వ్యక్తం అవుతోందో, అప్పుడు నీ లోపల ఉన్నటువంటి సద్వస్తువు ఆ మరణం లేనటువంటి వస్తువు స్వరూపంగా, నేనుగా వ్యక్తం అవుతుంది. నేను అనేటప్పటికి ఇప్పుడు దేహం మీకు ఏ విధంగా అయితే స్ఫురిస్తుందో, అదేవిధంగా ఎవడైతే అహంకారం లోంచి బయటకి వచ్చాడో వాడికి నేను అనేటప్పటికీ



**భగవంతుడే మనకు తల్లి, తండ్రి, గురువు.**
**మూడు ఆయనే. ఆయన దయ లేకుండా**
**మనకి శాంతి కలగదు.**

బ్రహ్మం స్ఫురిస్తుంది, ఆత్మ స్ఫురిస్తుంది, happiness స్ఫురిస్తుంది.

ఆచార్యుల వారు చెప్పేది ఏమిటి అంటే మీకు ఎప్పుడైనా కొంత సుఖం వస్తూ ఉంటుంది. ఇప్పుడు లేకపోవచ్చు, అప్పుడప్పుడు కొంచెం సుఖం వస్తూ ఉంటుంది, శాంతి వస్తూ ఉంటుంది, ఆనందం వస్తూ ఉంటుంది. అది కూడా ఆత్మదేనయ్యా, నీ అహంకారానిది కాదు, అది కూడా ఆత్మదే అంటున్నారు. ఎప్పుడైనా ఆనందంగా ఉన్నట్టు, శాంతిగా ఉన్నట్టు మీకు అనిపిస్తుంది అనుకోండి అది ఎవరిదో అనుకుంటున్నారేమో మీ ఆత్మదే, మీ స్వరూపానిదే, ఆ happiness మీరే. ఎప్పుడైతే మీకు ఆత్మానుభవం కలిగిందో లోకం అంతా కూడా మీకు సుఖంగానే కనిపిస్తుంది, శాంతిగానే కనిపిస్తుంది. ఏ కారణం వల్ల అయినా మీకు కొంచెం శాంతి కలిగింది అనుకోండి, ఆ శాంతి ఎక్కడ నుంచో వచ్చింది అనుకోకండి ఆత్మ లోంచే వస్తుంది, మీ స్వరూపం లోంచే వస్తుంది, అది మీరే అయ్యి ఉన్నారు.

కొంతమంది దేహం తోటి తాదాత్మ్యం చెందుతూ ఉంటారు. కొంతమంది మనకంటే కొంచెం తెలివైన వాళ్ళు ఉంటారు వారికి చైతన్యస్థాయి కొంచెం ఎక్కువ ఉంటుంది, మనం ఎంత బంధంలో ఉన్నామో, వాళ్ళు అంతే బంధంలో ఉంటారు. మనం ఎంత అజ్ఞానంలో ఉన్నామో, వాళ్ళు అంతే అజ్ఞానంలో ఉంటారు. కానీ వాళ్ళు తెలివి తోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటారు. మేము తెలివైన వాళ్ళం, మేము తెలివైన వాళ్ళం అనుకుంటారు. మీకు అర్థం అవుతోందా? మీకు ఏదైనా అధికారం ఉంది అనుకోండి, అధికారం తోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటారు. లేకపోతే తెలివి ఉంది అనుకోండి తెలివి తోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటారు. ధనం ఉంది అనుకోండి ధనం తోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటారు. ఏమీ లేని వాడికి దేహం ఉంటుంది కదా, దేహం లేకుండా ఎవరు ఉండరు కదా, అధికారం లేకపోయినా, ధనం లేకపోయినా, చదువు లేకపోయినా, ప్రతీ మనిషికి దేహం ఉంటుంది కదా, వాడేమో ఆ దేహంతోటి తాదాత్మ్యం పొందుతాడు, వీళ్ళు అందరూ జైలులోని జనమే. ఆచార్యుల వారు ఏమంటున్నారు అంటే జైలులో a క్లాసులో ఉన్నా, b క్లాసులో ఉన్నా, c క్లాసులో ఉన్నా జైలు జైలే, పోనీ b క్లాసులో ఉన్నవాడికి మంచం వేస్తారు,

c క్లాసులో ఉన్నవాడికి చాప ఇచ్చి కింద పడుకోమంటారు. వాళ్లకి మంచం ఇస్తారు, వీళ్ళకి చాప ఇస్తారు. వాడు జైల్లో ఉన్నట్టే, వీడు జైల్లో ఉన్నట్టే! కొంతమంది దేహం తోటి తాదాత్మ్యం పొందుతారు, కొంతమంది మాకు తెలివి తేటలు ఉన్నాయని తెలివి తోటి తాదాత్మ్యం పొందుతారు. కొంతమంది బంగారు పిచ్చుకలు ఉంటే వాళ్ళు ధనం తోటి తాదాత్మ్యం పొందుతారు. దేనితోటి తాదాత్మ్యం పొందినా నీకు అజ్ఞానం అక్కడ ఉన్నట్టే! తాదాత్మ్యం పొందే ఈ అహంభావన ఉంది చూశారు అది స్వతంత్ర్యంగా ఉండలేదు, ఏదో ఒక దానితో తాదాత్మ్యం పొందుతూ ఉంటుంది. నీలో ఉన్నటువంటి అహంభావన, అజ్ఞానం దేనితోటి తాదాత్మ్యం పొందుతోందో, దానిని వేరుతో సహా నువ్వు నశింపచెయ్యగలిగితే, అంటే మనస్సు యొక్క మూలాన్ని ఎప్పుడైతే వాడు చూశాడో, మనో మూలం తెలిసిన వెంటనే మనసు స్ఫురిస్తుంది. అప్పుడు వాడిని ఆకర్షించే వస్తువు ఏదీ కూడా ఉండనే ఉండదు.

ఆత్మ ఆత్మ అంటే ఎవరు? మనం రోజూ భగవద్గీతలో వింటున్నాం, ఉపనిషత్తులలో వింటున్నాం, శాస్త్రాలు, గురువులు చెప్పిన దాంట్లో ఆత్మ, ఆత్మ అని వింటున్నాము. ఆత్మ ఎవరు అంటే మనమే. ఆత్మ అంటే వైకుంఠంలో ఉందనో, కైలాసంలో ఉందనో అనుకుంటున్నాం. నువ్వు ఆత్మని తెలుసుకో, ఆత్మని తెలుసుకో అంటాడు కృష్ణుడు. ఆత్మని తెలుసుకో అంటే మనం ఏదో అనుకుంటాం, అది మనమే. అంటే ఆత్మని తెలుసుకోవడం అంటే మనలని మనం తెలుసుకోవడం. మనం ఆత్మే కాని మనకి ఆత్మబుద్ధి లేదు. ఆత్మబుద్ధి ఉంటే ఇంక ఆత్మని తెలుసుకోవలసిన పని లేదు. మనం ఆత్మే కానీ దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాం. మనకి దేహబుద్ధి ఉంది కానీ ఆత్మబుద్ధి లేదు. దేహం తోటి తాదాత్మ్యం పొందుతున్నాం కానీ ఆత్మ తోటి తాదాత్మ్యం మనకి లేదు. మనం ఎవరిగా ఉన్నాం? ఆత్మగా ఉన్నాం. ఆత్మని తెలుసుకోవడం అంటే మనలని మనమే తెలుసుకోవడం. ఆ విషయం మనకు గ్రహింపు లేక ఆత్మ అంటే ఎక్కడుంది అనుకుంటాం ఇదే మాయ. ఆత్మ అంటే తానే, ఇది మీకు బాగా గుండెకి పట్టాలి. ఆత్మ అంటే నువ్వే, నిన్ను నువ్వు తెలుసుకునేదే ఆత్మ విద్య. ఆత్మ అంటే ఎవరో అనుకోకండి, మనమే. కానీ అది మనం అన్న సంగతి

మనకి తెలియడం లేదు. తెలిస్తే సుఖపడతాం, తెలియదు అనుకోండి వేలాది జన్మలు ఇలా కొట్టుకుని పోతాం. చిన్న కిటుకు ఇది, తెలిస్తే ఇప్పుడే ఇక్కడే మనం సుఖపడతాం. తెలియదు అనుకోండి వేలాది జన్మలు ఎత్తుకుంటూ కొట్టుకుని పోతాం. అదే భగవాన్ చెప్పారు ఆ నేను అనే తలంపుని నువ్వు విచారణ చేశావా ఈ జన్మలోనే అది అణిగిపోతుంది. విచారణ చెయ్యకుండా అలా వదిలేశావా, కొన్ని కోట్ల జన్మలు నువ్వు ఆ ప్రవాహంలో కొట్టుకుని పోవలసిందే. ఆత్మ, ఆత్మ అంటే ఎవరో అనుకోవద్దు, మనమే. మనం ఆత్మ అయినప్పటికీ ఆత్మ అన్న సంగతి మనకి తెలియడం లేదు, అందుచేత ఆత్మ విద్య వచ్చింది. ఆత్మ విద్య ద్వారా దేనిని తెలుసుకోవాలి మరి? ఆత్మనే తెలుసుకోవాలి. అది ఎవరు? మనమే. ఇది బాగా అర్థం చేసుకోండి. మనం ఎవరో మనకి తెలిసే వరకు మనం కాని దానితోటి దేనితోనో మనం తాదాత్మ్యం పొందుతూ ఉంటాం. రంగుతోనో, ఆస్తితోనో, శరీరంతోనో, గౌరవంతోనో, పొలిటికల్ పవర్‌తోనో మనం కాని దానితో ఏదో ఒకదానితో మనం తాదాత్మ్యం పొందుతూనే ఉంటాం. ఎప్పటివరకు? మనం ఎవరో మనం తెలుసుకునే వరకు. మనం ఎవరో మనకి తెలిసినప్పుడు దేనితోను మనకి తాదాత్మ్యం ఉండదు. నువ్వు ఎవరో నీకు తెలిసేవరకు నువ్వు కానిదానిని నువ్వని అనుకుంటూనే ఉంటావు. నువ్వు ఎవరవో నీకు తెలిసినపుడు నువ్వు కాని దానిని నువ్వని అనుకోవలసిన పని లేదు. ఇది గుండుగొలనుఅని నాకు తెలియదు అనుకోండి, నేను భీమవరం అనుకోవచ్చు, నరసాపురం అనుకోవచ్చు, ఏలూరు అనుకోవచ్చు అది తెలియనప్పుడు, మీకు అర్థం అవుతోందా? ఇది గుండుగొలను అని నాకు తెలిసినప్పుడు నాకు ఆ నిశ్చయం వచ్చేస్తుంది. వివేకం అంటే నిశ్చయ జ్ఞానమే వివేకం. గుండుగొలను గ్రామస్తులు ఎవరికి అయినా ఇది గుండుగొలను అవునా, కాదా అని అనుమానం వస్తుందా? పొరుగూరు వాళ్లకి అనుమానం రావచ్చు, కానీ ఈ ఊరి వాళ్లకి ఇది గుండుగొలనా? కాదా? అని అనుమానం వస్తుందా? అనుమానం రాదు. అటువంటి నిశ్చయ జ్ఞానం నీకు కలిగినప్పుడే, అంటే ఆత్మజ్ఞానం అంత నిశ్చయంగా నీకు కలిగినప్పుడే అది వివేకం. సందేహం లేని జ్ఞానం, అది వివేకం అంటే! నేను అనే తలంపు

ఎక్కడ నుంచి వస్తుంది అంటే ఆత్మ లోంచే వస్తుంది. ఈ నేను అనే తలంపు ఎక్కడైతే అణిగిపోయిందో నీకు అక్కడ ఆత్మజ్ఞానం కలుగుతుంది. దీనికి, దానికి సంబంధం ఏమిటి అంటే, ఈ నేను నేను అంటున్నాం చూడండి, ఈ నేను అనే తలంపు శూన్యం లోంచి రావడం లేదు. నీకు బయట నుంచి రావడం లేదు. కాశీ లోంచి, రామేశ్వరం లోంచి రావడం లేదు. నేను అనే తలంపు నీ హృదయం లోంచి వస్తుంది. ఈ నేను అనే తలంపు ఏ హృదయంలో అయితే ఉందో ఆ హృదయంలోనే చైతన్యం కూడా ఉంది, అక్కడే ఆత్మ ఉంది. అంటే ఇది ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడ అది ఉదయిస్తుంది.

నీకు జ్ఞానం కాశీలో కలుగుతుంది, రామేశ్వరంలో కలుగుతుంది, తిరుపతిలో కలుగుతుంది అని అలా తిరుగుతున్నావు. చేతిలో నాలుగు రూపాయలు ఉన్నాయి, రైళ్ళు ఉన్నాయి, కార్లు ఉన్నాయి. ఒక టికెట్టు కొనుక్కుని తిరుగుతున్నావు. మీకు అర్థం అవుతోందా? ఫరవాలేదు తిరగవచ్చు. కానీ కృష్ణుడు గీతలో చెప్పింది ఏమిటి అంటే, నువ్వు dedicated గా, devoted గా నువ్వు హృదయ పూర్వకంగా సాధన చేస్తుంటే, ఏదో ఒక జన్మలో జ్ఞానం అనేది నీ హృదయంలోనే కలుగుతుంది అని చెప్పాడు. నీకు రామేశ్వరంలో కలుగుతుంది, చిన్న తిరుపతిలో కలుగుతుంది, పెద్ద తిరుపతిలో కలుగుతుంది అని ఆయన ఎక్కడా చెప్పలేదు. జ్ఞానం అనేది ఒక్కసారే కలగదు, కాల ప్రవాహంలో బహు జన్మలలో కృషి చేసి నీ బలహీనతలని పోగొట్టుకోవడం వలన నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఒకొక్క మనిషికి ఒకొక్క బలహీనత ఉంటుంది. ఈ బలహీనతల వలనే హృదయంలో ఉన్న వస్తువు మనకి తెలియడం లేదు. నీలో ఉన్న దోషాలు, నీలో ఉన్న పాపాలు, నీలో ఉన్న బలహీనతలు,

**నువ్వు స్వార్థంతో చేసే ప్రతి పని నీకు పునర్జన్మను తీసుకువస్తుంది. ఇతరుల క్షేమం కోసం నువ్వు ఏదైనా పని చేస్తే ఆ పని నిన్ను బంధంలో నుండి విడుదల చేస్తుంది.**



నీలో ఉన్న wrong habits, అవి తొలగించుకోవడానికి బహు జన్మలు పడతాయి. అలవాట్ల యొక్క వేగం వల్ల నీ హృదయంలో భగవంతుడు ప్రత్యక్షంగా ఉన్నా నీకు తెలియడం లేదు. అలవాట్లలోంచి ఒక్కసారి బయటకి వచ్చి చూడు, ఈశ్వరుడు నీకు ప్రత్యక్షంగా అనుభవం అవుతాడో, లేదో అప్పుడు చూడవయ్యా, ముందు నీ అలవాట్ల లోంచి నువ్వు బయటకి రా, అప్పుడు హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడో, లేదో నీకే తెలుస్తుంది. నీ అలవాట్ల లోంచి, నీ దోషాల లోంచి, నీ బలహీనతల లోంచి, నువ్వు ఎప్పుడైతే బయటకి వచ్చావో, అప్పుడు ఈశ్వరుడు నీ హృదయంలో ప్రత్యక్షంగా వ్యక్తం అవుతాడు, స్పష్టంగా వ్యక్తం అవుతాడు. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో, మీరు నన్ను ఎలా చూస్తున్నారో, అంత స్పష్టంగా మీ హృదయంలో ఆయన వ్యక్తం అవుతాడు. అయితే మీ అలవాట్ల యొక్క వేగం మీ ముఖాన్ని అటు తిప్పనివ్వడం లేదు. నేను ఇప్పుడు మీరు ఉన్నారా అని మిమ్మల్ని అడుగుతాను అనుకోండి, వెంటనే మీరు నేను ఉన్నాను అంటారు కానీ ఒక్క ఐదు నిముషాలు ఆగండి ఇంటికి వెళ్లి అద్దం చూసుకుని వస్తాను అంటారా? మీరు ఉన్నారు అని చెప్పడానికి మీకు అద్దం కావాలా? మీరు ఉన్నారని మీకు తెలియడం లేదా? అంత డైరెక్ట్ గా వస్తువు అనుభవంలోకి వస్తుంది అంటున్నారు.

ఒకొక్కసారి వర్షాకాలంలో మేఘాలు పడతాయి మళ్ళీ మేఘాలు చెదిరిపోతాయి. ఇంకొక గంటలో మళ్ళీ మేఘాలు కమ్మేసి కురవదు, కురవదు అనుకున్నది గంటల తరబడి వర్షం కురిసేయవచ్చు. అదేవిధంగా నీ అహంకారం కూడా పోగొట్టుకున్నప్పటికీ మూలంలో కనుక అది ఉంటే, అంతకుముందు నువ్వు ఎన్ని రకాలు జీవితంలో అనుభవించావో, ఎన్ని రకాల ఆకర్షణలకి గురి అయ్యావో, మళ్ళీ అహంకారం విజృంభించి అన్ని ఆకర్షణలకి నిన్ను ముంచేస్తుంది. అహంకారం యొక్క మూలం నశించినప్పుడు నువ్వు మాయ లోంచి బయటకి వచ్చావు అనుకోవాలి కానీ, అహంకారం మూలం నశించకుండా, అది అణిగినంత మాత్రం చేత నువ్వు మాయలోంచి బయటకి వచ్చాను అనుకోకు. మబ్బులు వచ్చే అవకాశం ఉంది, అంటే వర్షాకాలంలో మేఘాలు ఎలా వస్తూ ఉంటాయో, అదేవిధంగా ఈ అహంకారం

ఉన్నంత సేపు నీకు ఆ తలంపులు అనే రోగాలు వచ్చే అవకాశం ఉంది. Likes, Dislikes వచ్చే అవకాశం ఉంది. ఈ సంసారం అనేది దీర్ఘ రోగం లాంటిది, ఈ రోగం ఉన్నంతసేపు నీకు ఆ తలంపులు వచ్చే అవకాశం ఉంది. సంసారం బయట లేదు, అహంకారం రూపంలో నీకు లోపలే ఉంది అని ఇక్కడ చెబుతున్నారు. దీనిని నమ్మడానికి వీలు లేదు, వేరుతో సహా నువ్వు దానిని తొలగించినప్పుడు అది పోయింది అని నమ్మాలి కానీ వేరు లోపల ఉన్నంతకాలం బాహ్యంగా నువ్వు కొన్ని సాధనలు చేసినప్పటికీ వేరుని కనుక నువ్వు నశింపచెయ్యలేకపోతే నువ్వు కూడా ఎప్పుడైనా మాయలో పడే అవకాశం ఉంది.

ఆచార్యుల వారు చెప్పేది ఏమిటి అంటే, నీకు దేహం ఉన్నంత కాలం ఏదో ఒక రోగం ఎప్పుడో ఒకప్పుడు వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా నీకు అహంభావన ఉన్నంత వరకు నువ్వు అహంభావనని తొలగించుకోవడానికి సాధన చేస్తున్నప్పటికీ మాయని జయించాను అని అనుకోకు, మాయలో పడే అవకాశం ఉంది. నా మాయని ఎవడూ జయించలేడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఎవరూ జయించకపోతే కొంతమంది జ్ఞానులు అయ్యారు కదా, వాళ్ళు ఎలా అయ్యారు? మాయ ఎవరికి దారి ఇస్తుంది అంటే భగవంతుడిని ఆశ్రయించిన వాడికి దారి ఇస్తుంది. అంటే మానసికంగా భగవంతుడి తోటి సంబంధం పెట్టుకున్నవాడికి ఆ మాయ దారి ఇస్తుంది. మాయ దారి ఇస్తే మనం భగవంతుడిలో ఐక్యం కాగలం కానీ, మాయ కనుక దారి ఇవ్వకపోతే మనం భగవంతుడిలో ఐక్యం కాలేము, అందుచేత మాయ దారి ఇవ్వాలి, అది దారి ఇవ్వకపోతే మనం చేసేది ఏమీ లేదు.


దేహం ఉన్నంతసేపు నీకు ఎప్పుడైనా రోగం వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ రోగం వచ్చినా మీరు ఎవరూ ఆశ్చర్యపడకండి, అది దాని స్వభావం. అదేవిధంగా అహంభావన ఉన్నంతకాలం మీరు ఎప్పుడైనా బంధంలో పడే అవకాశం ఉంది, నరకంలో పడే అవకాశం ఉంది. అహంభావం ఉన్నంతసేపు మేము ఒడ్డుకి వచ్చేశాం అని చెప్పడానికి అవకాశం లేదు. మీ ముక్కులో గాలి తిరుగుతున్నంత కాలం మీరు సాధన విషయంలో

శ్రద్ధగా ఉండవలసిందే. ఏ క్షణంలో అయినా మాయలో పడవచ్చు, ఇప్పుడు మీరు సాధన చేసి తాత్కాలికంగా అహంకారాన్ని అణిచినప్పటికీ మళ్ళీ దాని విజృంభణ ఎప్పుడైనా వస్తే, మీ పూర్వపు వాసనలు, పూర్వపు అలవాట్లు అన్నీ వచ్చేస్తాయి. ఎందుచేత అంటే లోపల విత్తనం ఉంది కదా, దానిని మనం నమ్మడానికి వీలు లేదు. అందుచేత మీకు అహంభావన వేరుతో సహా నశించాలి అప్పుడు అజ్ఞానం లోంచి బయటకి వచ్చాం, అలవాట్లలోంచి బయటకి వచ్చాం అనుకోవాలి కానీ తాత్కాలికంగా ఏదో డాక్టరు గారు చెప్పారని నాలుగు రోజులు మీరు ఆరోగ్య సూత్రాలు పాటించినా, ఐదో రోజున మళ్ళీ మీ పద్ధతి మీదే లోపల అజ్ఞానం ఉంది కాబట్టి. పుండు అంతా లోపల ఉంది, దానిని మీరు పోగొట్టుకోవాలి. ఆచార్యుల వారు ఏమని చెబుతున్నారు అంటే వర్షాకాలంలో మబ్బులు ఎలా ముసురుకుంటూ వచ్చేస్తాయో, ఒకొక్కసారి అహంభావన విజృంభించినప్పుడు కోప తాపాలు, రాగ ద్వేషాలు అలా విజృంభించుకుంటూ వచ్చి నిన్ను ముంచేస్తాయి. వర్షాకాలం ఒకొక్కసారి మేఘాలు చూడండి అన్ని వైపుల నుండి వచ్చేస్తాయి. అంతా చీకటి చేసి పడేస్తాయి. మన ఇంట్లో పగలు కూడా ట్యూబ్‌లైట్ వేసుకోవాల్సిందే, అన్ని మేఘాలు వచ్చేస్తాయి. అదేవిధంగా నీకు అహంభావన విజృంభించినప్పుడు అన్ని తలంపులు వచ్చి నిన్ను ముసిరేస్తాయి. అది వేరుతో సహా నశించేవరకు దానిని నమ్మడానికి వీలు లేదు. ఇది బాగా అర్థం చేసుకోండి, చెట్టు ఎండిపోయింది కాని లోపల వేరు చచ్చిపోలేదు అనుకోండి, అప్పుడు నీళ్ళు పొయ్యడం మొదలు పెడితే దానికి పూర్వపు ఆకులు, రొబ్బలు, పువ్వులు ఎలా వచ్చేస్తాయో అదేవిధంగా మీకు లోపల ఆహంభావన నశించలేదు అనుకోండి బాహ్యంగా మీరు పోగొట్టుకోవల్సినవి అన్నీ పోగొట్టుకుని మీరు బాహ్యంగా విడిపోవలసిన విషయాలలోంచి విడువడ్డారు అనుకోండి, కాని లోపల ఆహంభావన ఉంది కదా, మళ్ళీ దానికి పూర్వపు అలవాట్లు, పూర్వపు వాసనలు అన్నీ కూడా మిమ్మల్ని అల్లుకుని వచ్చేస్తాయి. అది వేరుతో సహా పోయేవరకు నమ్మడానికి వీలు లేదు. అంటే ముందు జాగ్రత్త కోసం ఆచార్యుల వారు హెచ్చరిస్తున్నారు.

అహంభావన ప్రేరణ వల్ల వచ్చే మాటలు, అహంభావన ప్రేరణ వల్ల వచ్చే తలంపులు,

అహంభావన ప్రేరణ వల్ల వచ్చే ఆలోచనలు, అహంభావన ప్రేరణ వల్ల వచ్చే సంకల్పాలు, అహంభావన ప్రేరణ వల్ల మీరు చేసే పనులు, వీటి అన్నిటినీ మీరు సమూలంగా వదులుకోవడానికి సిద్ధంగా లేకపోతే మీకు బ్రహ్మానుభవం కలగదు, ఆత్మానుభవం కలగదు. మనం మాట్లాడేటప్పుడు తెలుస్తూ ఉంటుంది అవసరం కోసం మాట్లాడుతున్నామా? అహంభావన కోసం మాట్లాడుతున్నామా? అని, కొంతమంది వాళ్ళ గొప్పల కోసం పని చేస్తారు కానీ అవసరం ఉండి చెయ్యరు. స్వామీజీ అనేవారు కొంతమంది నీళ్ళు లేని చోట నుయ్యి తవ్వండి అంటే తవ్వరు, మేము గంగానది ఒడ్డునే తవ్వుతాం అంటారు. గంగానది ఒడ్డున ఎందుకు అయ్యా, గంగానదిలో మంచినీళ్ళు దొరుకుతున్నాయి కదా అంటే అక్కడ తవ్వితే పేరు వస్తుంది అంటారు. ఈ బాపతు జనం తోటి లోకం నిండి ఉంది అంటున్నారు ఆచార్యులవారు. స్వాములవారు ఏమంటున్నారు అంటే, నువ్వు అహంభావన ప్రేరితంగా వచ్చే మాటలు మాట్లాడకుండా ఉండు. అహంభావన ప్రేరణ వల్ల ఏదైనా మాట వచ్చింది అనుకో నీ నోటికి తాళం వేసేసుకో అంటున్నారు. మనం గదులకు తాళాలు ఎలా వేసుకుంటామో నోటికి కూడా తాళాలు వేసుకోమంటున్నారు. అహంభావన ప్రేరణ వల్ల వచ్చే పని కూడా నువ్వు చెయ్యకు. అలా నువ్వు నిగ్రహించుకోవడంవల్ల భగవంతుడు నిన్ను అనుగ్రహించి నీ లోపల ఉన్నటువంటి ఆనందం, నీ హృదయంలో ఉన్న ఆనందం నీ చేతికి అందేలా చేస్తాడు.

ఒకొక్కసారి వర్షాకాలంలో నూతిలో నీళ్ళు ఎంత పైకి వస్తాయి అంటే మన చేతికి



**సాధ్యమైనంతవరకు జీవితంలో సహజంగా ఉండాలి. సహజంలోనే అందం, ఆనందం ఉంది. ఎవడైతే సహజంగా జీవిస్తున్నాడో, వాడు భగవదనుగ్రహం అర్థించకపోయినా వాడి మీద భగవదనుగ్రహం వర్షిస్తుంది.**

అందుతాయి, బకెట్ కూడా అక్కరలేదు. అదేవిధంగా నువ్వు ఎప్పుడైతే అహంభావాన్ని సెంటర్ గా పెట్టుకుని మాట్లాడడం మానేశావో, నువ్వు ఆ రకంగా నిగ్రహించుకుంటున్నావు కాబట్టి దానికి బహుమానంగా ఈశ్వరుడు నిన్ను అనుగ్రహించి, ఆయన ప్రేమ నీ మీద వర్షింప చేసి, నీ హృదయంలోని ఆనందం నీ చేతికి అందేలా చేస్తాడు. ఇక్కడ ఆచార్యుల వారు స్పష్టంగా చెబుతున్నారు. ఆనందం నీదే, ఆయనది కాదు. కానీ నీ హృదయంలో ఆనందం ఉన్నా నీ చేతికి అందకపోతే నీకు సుఖం లేదు కదా, నీ హృదయంలో ఉన్న ఆనందం నీ చేతికి అందేలా చేస్తాడు పరమేశ్వరుడు నువ్వు అహంభావనని అణుచుకుంటూ ఉంటే, అప్పుడు పరిణామం లేని స్థితి, ఉన్న స్థితి నీకు వ్యక్తం అవుతుంది. ఎలా వ్యక్తం అవుతుంది అంటే తనంతట తానుగా వ్యక్తం అవుతుంది, నేనుగా వ్యక్తం అవుతుంది. వైకుంఠంలో ఏ దేవుడు ఉన్నాడు అని నువ్వు అనుకుంటున్నావో, కైలాసంలో ఏ దేవుడు ఉన్నాడు అనుకున్నావో, ఆ దేవుడు నీకు నేనుగా వ్యక్తం అవుతాడు. అంటే బ్రహ్మం నీకు నేనుగా వ్యక్తం అవుతుంది. మీరు గుళ్ళోకి వెళ్లి పూజ చేస్తున్నారు. ఇంట్లో కూడా అందరికీ పూజ గదులు ఉంటాయి కదా! కృష్ణుడు, రాముడు, శివుడు ఉంటాడా పూజ గదిలో, రోజూ ఉదయం ఒక ఐదు నిముషాలు పూజచేసి మంచి నీళ్ళు అవి ఇచ్చేస్తారు వాడికి, ఏ అరటిపండో నైవేద్యం పెట్టి మళ్ళీ తాళం వేసేస్తారు. మరుసటి రోజు ఉదయం వరకు వాడు అలా జైల్లో ఉంటాడు. అలా కాదు అయ్యా, 24 గంటలు నువ్వు ఆ బొమ్మ దగ్గర కూర్చోకపోయినా మానసిక పూజ చెయ్యడం నేర్చుకో అంటున్నారు ఆచార్యుల వారు. నువ్వు ఎక్కడ కూర్చున్నా, ఏమిచేస్తున్నా, తింటున్నా, నడుస్తున్నా, నీ మనసు తోటి ఆ దేవుడికి పూజ చెయ్యడం నేర్చుకోవయ్యా, నీకు మోక్షానుభవం కలుగుతుంది. ఏమి పూజ అది? మానసిక పూజ. నువ్వు మనస్సు తోటి నిరంతరం ఆయనకి పుష్పాలు వేస్తున్నట్టు, ఆయనకి నామం చేస్తున్నట్టు, ఆయనకి నైవేద్యం పెడుతున్నట్టు నిరంతరం ఆయనకి మనసులో పూజ చేస్తూనే ఉండు. అది మానసిక పూజ, దాని వలన నీకు మోక్షానుభవం కలుగుతుంది. అంటే నిరంతరం మనస్సులో ఆయన నామాన్ని జపించు, ఆయనను ధ్యానించు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# హైదరాబాదు లక్ష్మిగారు (మాదాపూర్)



శ్రీనాన్నగారి హైదరాబాదు భక్తులలో శ్రీమతి లక్ష్మి గారు ప్రథములే కాదు, అత్యంత సన్నిహితులు కూడా. హైదరాబాద్లో మొదటి సత్సంగం ప్రారంభించి భక్తులకు ఒక వేదిక కల్పించి, భగవాన్ మరియు నాన్నగారి గురించి, వారు చూపిన ఆధ్యాత్మిక మార్గము వ్యాప్తికి కృషి చేసిన ప్రథమ భక్తులలో లక్ష్మిగారు ఒకరు. **1990-1991** సంవత్సరాల నుంచి, శ్రీ నాన్నగారు భక్తులమీద అనుగ్రహంతో హైదరాబాద్ తరచూ రావటం ప్రారంభించినప్పటి నుంచి, వారికి, వారి భక్తులకు మొదట ఆతిథ్యం ఇచ్చినవారు లక్ష్మిగారి తల్లితండ్రులు, ఇంకా సావిత్రిమామ్మ గారు. కొద్దికాలంలోనే నాన్నగారు తన బస లక్ష్మిగారి ఇంటికి మార్చి, చాలా సంవత్సరాలు భక్తులను, మొదట మధురానగర్, తరువాత జూబిలీహిల్స్, మాధాపూరులలో, లక్ష్మిగారి ఇంటినుండే అనుగ్రహించారు. లక్ష్మిగారు దేహత్యాగం చేసినతరువాత కూడా , నాన్నగారి తలంపులలో లక్ష్మిగారు నిండిపోయి ఉండేవారు. ఆయన హృదయములో లక్ష్మిగారికి ఉన్న ఉన్నతమైన స్థానానికి అదే గుర్తు.

# లక్ష్మిగారి మాటలలో శ్రీ నాన్నగారితో వారి అపూర్వమైన అనుబంధం

నాకు బాహ్యంగా జీవితంలో ఏ లోటూ లేదు. కాని ఏదో వెలితి. జీవితం ఇంతేనా అనిపించేది. ఆ సమయంలో మా అమ్మమ్మగారు చనిపోయారు. విపరీతమైన దుఃఖం. ఏమిటీ జీవితం? ఎందుకు పుడుతున్నాం? ఎందుకు మరణిస్తున్నాం? మరణాంతర జీవితం ఏమిటి? ఒకటే ఆలోచనలు. ఆ పది రోజులు, భగవంతుడా! నువ్వుంటే నాకు సపోర్టుగా రా అని ప్రార్థించేదాన్ని.

**9 ఫిబ్రవరి 1990- నా జీవితంలో మరచిపోలేని రోజు.**

నా స్నేహితురాలు పుష్ప "అమృతవాక్కులు" అనే పుస్తకం ఇచ్చి చదవమంది. నేను తీసిన పేజీలో "నీ దేహమే నీది కానప్పుడు ఈ లోకం నీదంటావేమిటి?" అన్న వాక్యం చదివిన వెంటనే ఆలోచన మొదలైయింది. అమ్మమ్మ పోయారే అని బాధపడుతున్నానేమిటి? నా దేహమే నాది కానప్పుడు, దీన్ని కూడా ఒకరోజు వదిలెయ్యాలి కదా! ఎంత అద్భుతంగా ఉంది. పుస్తకము మీద "నాన్నగారు" పేరు చదివాను. "నాన్నగారెవరు?" అని అడిగాను. "నాన్నగారు జిన్నూరులో ఉంటారు. తీసుకెళతాను. వస్తావా" అని మా తాతయ్య చెల్లెలు అన్నారు. ఆ వాక్యం చదివిన అరగంటలోనే జిన్నూరు బయలుదేరాను. అది నేను ఆనందమయ జీవితంలోకి ప్రవేశించే రోజు అని, నాకు ఆ రోజు తెలియదు.

నాన్నగారింటికి వెళ్లి వారి పాదాలకు నమస్కరిస్తూ ఉంటే, ఏదో తెలియని ఆనందం వచ్చింది. మా మామ్మగారు నాన్నగారికి పరిచయం చేస్తూ, లక్ష్మి "అమృతవాక్కులు" చదివి ఆ పుస్తకాల కోసం వచ్చిందన్నారు. అందులో "ఏం చదివావమ్మా" అన్నారు. "నీ దేహం నీది కానప్పుడు ఈ లోకంలో నీదంటూ ఏముంది?" ఆ మాట నాకు చాలా నచ్చింది అన్నాను. ఒక్కమాట చదివి వచ్చావా అమ్మా లక్ష్మీ అంటూ ఏడెనిమిది సార్లు అన్నారు. ఆ పిలుపు వింటూంటే నా 23 ఏళ్ల జీవితంలో ఎవ్వరూ అంత ప్రేమగా పిలవలేదు అనిపించింది. నాన్నగారి దగ్గర ఒక అర గంట ఉండి వచ్చేసాను.

ఆ రాత్రంతా 'అమృత వాక్కులు' 'నాన్న ఉవాచ' చదివాను. ఒక్కొక్కమాట చదువుతూ ఉంటే తెలియని లోకాలకు తీసుకెళుతున్నట్టు అనిపించింది. నాన్నగారి పుస్తకాలలో చదివిన మాటలు నాన్నగారి గొంతుతో వచ్చేసేవి. పువ్వులు కోస్తూ ఉంటే, "దేవుని పాదల వద్ద నీ

అహంకారమనే పుష్పం పెట్టమ్మా" అని వచ్చేది. ఏమైనా పని అయిష్టంగా చేస్తే 'ఇష్టంగా చేయి, కొత్త వాసనలు రావు, పాత వాసనలు పోతాయి' అని నిరంతరం హృదయంలో నుండి గైడెన్స్ వచ్చేది.

ఒక ప్రవచనంలో నాన్నగారు 'మీ హృదయంలో భగవంతునికి చోటివ్వండి' అన్నారు. నా మనస్సులో తలంపులు ఎంతసేపు అణిగితే అంతసేపు హృదయం ఖాళీ అవుతుంది. అప్పుడే భగవంతునికి చోటిచ్చినట్టు అని అనిపించింది. అమృతస్థితి పొందకుండా మనస్సే అడ్డు వస్తోంది. 'ఆ మనస్సుని పట్టించుకోకు' అని నాన్నగారు చెప్పిన మాట నాకు చాలా ఇష్టం. సాధన అదే చేస్తోంది. అదే చెప్పుకుంటుంది. అదే పెరిగి పోతుంది.

ఒకసారి నాన్నగారితో కారులో వెళ్తూ "దేహంతో తాదాత్మ్యం వల్లనే కదా ఇన్ని బాధలు నాన్నగారూ!" అన్నాను. "అవునమ్మా! ఆ తాదాత్మ్యం పోగొట్టుకోవడం పెద్ద కష్టం కాదు. నీకు ఎవరింటికైనా వెళ్లాలనిపిస్తుంది అనుకో అదీ ఒక తలంపే కదా, దాన్ని తలంపుగా ఎలా చూస్తున్నావో, ఈ దేహం నేను అనే దానిని కూడా అలాగే తలంపులా చూడు. ఆ తలంపులో నుండి విడుదల పొందితే, ఇప్పుడే ఇక్కడే జ్ఞానం పొందవచ్చు" అన్నారు.

నాన్నగారి బోధ నిజతత్వానికి మనల్ని చేరుస్తుంది. ఆ చేరుకోవటానికి వచ్చే అనేక అడ్డంకుల్ని వివిధ కోణాల్లో మనస్సుకి హత్తుకునేటట్లు చెప్తారు. నాన్నగారు ఇది పోగొట్టుకోమని చెప్పరు. కాని ఏవైతే అమృతస్థితి పొందకుండా అడ్డువస్తున్నాయో అవి మనకి కూడా తెలియకుండా రాలిపోతాయి.

భగవాన్‌ని భుజాన వేసుకుని ఊరూరు, ఇల్లిల్లూ తిరుగుతూ పామరులలో సైతం నిజం ఏది అనే ఆలోచన కలిగిస్తున్నారు. ఆయన ప్రేమ అపారం. ప్రతి ఒక్కరిని ఆ ప్రేమ బంధిస్తుంది. ఆయన ప్రేమ, ఆప్యాయత, బోధించే జ్ఞానం, అనుగ్రహం మాటలలో చెప్పుకుంటే ఆయనను తక్కువ చేసిన వారము అవుతామేమో అనిపిస్తుంది. సృష్టిలో దేనితోనూ ఆయనని పోల్చలేము. నాన్నగారు అన్న నాలుగు అక్షరాలు నాలుగు వేదాల సారం.

ఒకరోజు అరుణాచలం శివాలయంలో కొత్త భక్తులు "ఈ రోజే నాన్నగారిని

చూస్తున్నాం. వారి గురించి ఏమైనా చెప్పండి” అని అడిగారు. మీరు ఆలయంలో శివుడిని చూసి దైవభావంతో పాటలు పాడారు. నా దేవుడు నాన్నగారే! ఎందుకంటే ఎలా జీవించాలో, ఎలా బంధం నుండి విడుదల పొందాలో, ఎలా శాంతి పొందగలమో తెలిపింది నాన్నగారే. నాన్నగారు నాన్నగారే!”అన్నాను.

నాన్నగారి ప్రతి మాట మనల్ని ఆలోచింప చేస్తుంది. మనస్సుని ఎడ్యుకేట్ చేస్తుంది, వెలుగులోనికి తీసుకువెళ్తుంది. ఆయన నోటినుంచి వచ్చే ప్రతీమాట నాకు చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంటుంది. ఈ తండ్రి రాకపోతే ఏమైపోదునో అనిపిస్తుంది. ఈ తండ్రిని మాకు ప్రసాదించినందుకు భగవాన్‌కి కృతజ్ఞతలు చెప్పుకుంటాను. భగవాన్! మేమంటే నీకు పక్షపాతం ఉంది. ప్రపంచంలో ఎంతమంది భక్తులు లేరు నీకు. కాని నాన్నగార్ని మాకు ప్రసాదించావు. ఆ తండ్రి చైతన్య వైభవం బోధిస్తూ, ఆనందాన్ని రుచి చూపిస్తూ తీసుకెళ్తున్నారు. భగవాన్! నీ అనుగ్రహం మా మీద ఉందనటానికి నిదర్శనం నాన్నగారు!”

అరుణాచలం, భగవాన్, నాన్నగారితో నాకు తెలియని సంకెళ్ళు పడ్డాయి. వారిని ప్రేమించాలని ప్రేమించ లేదు. ప్రేమించకుండా ఉండలేక ప్రేమిస్తున్నాను. “మనది జన్మాంతర సంబంధం అమ్మా” అన్నారు నాన్నగారు.

**– శ్రీమతి లక్ష్మిగారు, మాదాపూర్**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# సద్గురు జయంతి

దిII 23-09-2025న సద్గురు శ్రీనాన్నగారి జయంతిని జరుపుకోబోతున్నాం. తాను దేహధారియై ఉన్నంతకాలము సద్గురు శ్రీరమణుని బోధామృతమును మనందరికీ పంచియిచ్చారు. ఆయన బోధస్వరూపులు. సూటిగా అంతర్యామిని స్వరూపంగా దర్శించుటకు ఒక క్రమబద్ధమైన బోధ చేసారు. భాషకు అందని పరమాత్మ తత్త్వమును, అతిసులభమైన భాషలో మనబోటి సామాన్యులకందించుటలోనూ, అపారమైన ప్రేమతత్త్వ ములోనూ, ఆయనకు ఆయనే సాటి. జిజ్ఞాసువులకు సూటిగా అంతర్ముఖత్వమును సిద్ధింపజేయుట "నేను" అను అంతిమతత్త్వములో నిలుపుట అన్నవి వారి సామర్థ్యములు. మనందరి మనస్సులను హృదయాభిముఖంగా మళ్ళించుటకు అనేక ఉపాయములను ఉపదేశించారు. ఏకాంతవాసము, సత్సంగము, సత్ప్రవర్తన, సద్బుద్ధి, అహంభావన లేకుండా జీవించడం మున్నగువాటి ప్రాముఖ్యతను మనందరికి వివరించారు. జిన్నూరు గ్రామమును కేంద్రముగా పెట్టుకొని, రమణబోధయే ఊపిరిగా జీవించి, దానిని మనందరికీ బోధించి ధన్యులైనారు. ప్రేమమూర్తి, దయాస్వరూపులు అయిన శ్రీనాన్నగారి జీవిత విధానము ఆదర్శవంతమైనది. వారి బోధను నేటికీ మనకు అందించే రమణభాస్కర ద్వారా సాధకులు పురోగతి చెందుతూనే ఉన్నారనుట నిస్సందేహము. శ్రీనాన్నగారు వంటి సద్గురువు లభించుట అనేక జన్మల పుణ్యఫలము. లౌకిక జీవితము, ఆధ్యాత్మిక జీవితము అని రెండూ వేరు వేరుగా లేవు. లౌకిక జీవితముతో సంబంధము లేని ఆధ్యాత్మిక సాధన గాలిలో మేడలు కట్టుట వంటిది. సద్గురు శ్రీనాన్నగారి ప్రేమతత్త్వానికి ఆకర్షింపబడి ఆ వెలుగులో ఎందరో పవిత్రతను, అంతరదృష్టిని సాధించారు. ఆయన సకల మానవాళి శ్రేయస్సుకై కృషిచేసారు. తన సమక్షముచేత అనేకమందిని శాంతిమంతులను చేసారు. భగవాన్ శ్రీరమణుని బోధాసారాన్ని తమ ప్రవచనములు మరియు రమణభాస్కర ద్వారా ప్రసాదముగా మనకు అందించారు. సద్గురు బోధను నిరంతరం శ్రవణ, మనన, నిధి ధ్యాసనములు మరియు పఠనము వలన భ్రమరకీటక న్యాయము వలె, భ్రాంతిలో ఉన్న మనల్ని బ్రహ్మముగా మారుస్తుంది. ఒకనికి పూర్ణస్థితి కలగాలంటే, పూర్ణస్థితిలో ఉన్నటువంటి సద్గురుని అనుగ్రహం ఆవశ్యకము. మూర్తీభవించిన ప్రేమతత్త్వం సద్గురు శ్రీనాన్నగారు. వారితో సంభాషణ గురువు-సర్వవ్యాపి, సర్వాంతర్యామి, కాలాతీతుడు అన్న వేదవాక్యాలకు దర్పణం పట్టేది. తానెవరో, తన గమ్యమేమిటో తెలియక దుఃఖము, అశాంతికి లోనవుతున్న మనిషికి పరమాత్మ గురురూపంగా తారసపడి, దారిచూపి ఆ గమ్యం వైపుకు అంతర్ముఖులను చేస్తారు. అట్టివారే సద్గురు శ్రీనాన్నగురుదేవులు, వారు చూపిన మార్గంలో నడిచేవారు ధన్యులు.

**(దిII 23-09-2025 సద్గురు శ్రీనాన్నగారి జయంతి సందర్భముగా...)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు**

దిII 23-09-2025 మంగళవారం సద్గురు శ్రీ నాన్నగారి జయంతి



**జిన్నూరు వాసాయ భక్తహృదయ నివాసాయ**

**శ్రీనాన్న గురువరాయ మహిత మంగళం**

**రాజాయమ్మ సుపుస్త్రత్రాయ మృదుమధుర భాషణాయ**

**శ్రీనాన్న గురువరాయ నిత్యమంగళం**

**అరుణాచల భక్తాయ పుర్ణచంద్ర వదనాయ**

**శ్రీనాన్న గురువరాయ సర్వమంగళం**

**శ్రీనాన్న గురువరాయ సర్వమంగళం.**



# నా మనసులోని మాట

**పింగళి సూర్యసుందరం**

కొందరి మాట మధురం, కొందరి చూపు కోమలం, కొందరి నైజం కరుణాపూరితం, కొందరి హృదయం ప్రేమమయం, కొందరి ప్రేమ నిస్స్వార్థం, కొందరి వర్తనం నిరాడంబరం, కొందరి పరిచయం అమూల్యం, కొందరి సాంగత్యం ఆహ్లాదకరం, ఈ సలక్షణాలలో ఒకటో రెండో ఎవరిలోనైనా కనపడవచ్చు. కాని అన్నీ రాశీభూతమై ఒక్కరిలో కనబడటం అసాధారణం. అటువంటి అసాధారణ మనిషి శ్రీ నాన్నగారు.

భగవాన్ శ్రీ రమణమహర్షి బోధనలను నిజజీవితంలో అనుభవ సిద్ధం చేసుకొని ఒక ఆనందమయ స్థితిని చేరి ఆ ఆనందాన్ని ఏ ఆర్భాటమూ లేకుండా అందరికీ పంచి పెట్టాలనే ధ్యేయానికి జీవితాన్ని అంకితం చేసిన పరోపకార పరాయణుడు శ్రీ నాన్నగారు.

అతిసూక్ష్మమైన శ్రీ రమణతత్త్వాన్ని పామరులకు కూడా సులభంగా అర్థం అయ్యేటట్లు తమదైన విశిష్టశైలిలో బోధించగలిగిన సద్గురువు శ్రీ నాన్నగారు.

ఆధ్యాత్మికతకీ కుటుంబజీవనానికీ పరస్పర వైరుధ్యం లేదని ఆచరించి చూపిన ఆదర్శగృహస్థు శ్రీ నాన్నగారు.

శ్రీ నాన్నగారిని మనమందరమూ మనసారా సత్కరించి గౌరవించి పూజించి వారి పరిపూర్ణ ఆశీర్వాదములు పొందుదాం.